


PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:27 ఎడిటర్: రాపోలు లింగస్వామి 27-09 -2026 ఆదివారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

## తెలంగాణ తెగువకు నిలువెత్తు నిదర్శనం చాకలి ఐలమ్మ



హైదరాబాద్, సెప్టెంబర్ 26: చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నివాళులు అర్పించారు. తెలంగాణ ఆత్మగౌరవ ధిక్కార స్వరం.. రాష్ట్ర తెగువకు ఆమె నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. తెలంగాణ రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతే లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తేనే ఆమెకు నిజమైన నివాళి అర్పించినవాళ్లమవుతామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. నాటి రాచరిక పాలనలో, రాష్ట్ర రైతాంగ న్యాయమైన హక్కుల కోసం, ధిక్కార స్వరం వినిపించిన ధీర వనిత అని ప్రశంసించారు. అణచివేతకు గురవుతున్న సబ్బండ కులాల ఆత్మగౌరవ ప్రతీక ఐలమ్మ అని కొనియాడారు.

**ఐలమ్మ పోరాటం నేటి తరానికి ఆదర్శనీయం..**

నాటి భూస్వాములను ఎదిరించి ధిక్కార స్ఫూర్తిని.. నాటి చట్టాల పరిధిలో న్యాయస్థానంలోనూ పోరాడి గెలిచి ప్రజాస్వామిక నిబద్ధతను ప్రదర్శించిన ఐలమ్మ పోరాటం నేటి తరానికి ఆదర్శనీయమని కేసీఆర్ ప్రశంసించారు. ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా సాగుతున్న, అస్తవ్యస్త పాలనా రాజకీయ పరిస్థితుల్లో ఆమె ప్రజాస్వామిక పోరాట స్ఫూర్తి, ప్రదర్శించిన రాష్ట్ర తెగువ నేటి యువతకు అనుసరణీయమని పేర్కొన్నారు. శాంతియుత పంథాలో తాను ప్రారంభించిన మలిదశ తెలంగాణ సాధన పోరాటంలో ఐలమ్మ అందించిన పోరాటం ఇమిడి ఉందని తెలిపారు. చాకలి ఐలమ్మ గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు చాటేలా.. బీఆర్ఎస్ హయాంలో ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయాన్ని తీసుకువచ్చామని అన్నారు.

**మా హయాంలో వినూత్న పథకాలను అమలు చేశాం..**

ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగా.. నాటి పదేళ్ల ప్రగతి ప్రస్థానంలో, మహిళలు, శిశు సంక్షేమం, రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతి కోసం అనేక వినూత్న పథకాలను అమలు చేశామని కేసీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేస్తూ, కుల వృత్తులను పునరుజ్జీవింప చేసి, సబ్బండ కులాల ఆర్థిక, సామాజిక ఆత్మగౌరవాన్ని మహోన్నతంగా నిలబెట్టామని గుర్తు చేశారు. తమ హయాంలో సాధించిన ఫలితాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కేసీఆర్ ఉద్ఘాటించారు.

## వారసత్వ సంపదను కాపాడుకుందాం

మాగనూర్ కృష్ణ : భారత వారసత్వ సంపదను కాపాడుకోవాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని కృష్ణ మండలం ముడుమాల గ్రామంలో 3,500 సంవత్సరాల నాటి చారిత్రక నిలువురాళ్ల వద్ద శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆమె మాట్లాడుతూ ముడుమాలలోని నిలువురాళ్లు వేల సంవత్సరాల చరిత్రకు, ఖగోళ పరిజ్ఞానానికి ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. ఇంతటి విలువైన వారసత్వ సంపద నారాయణపేట జిల్లాలో ఉండటం ప్రతి ఒక్కరూ గర్వించాల్సిన విషయమని పేర్కొన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను పరిరక్షించడంతో పాటు, వాటికి విస్తృత గుర్తింపు తీసుకురావచ్చని వెల్లడించారు.ముడుమాల నిలువురాళ్లకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. డెక్కన్ హెరిటేజ్ సంస్థకు చెందిన ప్రొఫెసర్ ప్రవీణ్ నిలువురాళ్ల చారిత్రక ప్రాధాన్యత, వాటి వెనుక ఉన్న ఖగోళ సంబంధిత అంశాలను వివరించారు.

## కేంద్ర కులగణనలో బీసీల లెక్క చెప్పాలి

సిద్దిపేట జిల్లా: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి తమ



ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. శనివారం సిద్దిపేట జిల్లాలోని వేములవాడ రోడ్డులో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కలెక్టర్ హైమావతి ,సీపీ రష్మీ పెరుమాళ్ పాల్గొన్నారు. వీర నారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి మంత్రులు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల లెక్కలను కేంద్ర ప్రభుత్వం తీస్తోందని.. బీసీల లెక్కలను ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నించారు. కేంద్రం చేస్తున్న కులగణనలో బీసీల లెక్క తేలాలని డిమాండ్ చేశారు. కోర్టు కేసుల నేపథ్యంలో రిజర్వేషన్లలో జాప్యం జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఖైరతాబాద్ ఉప ఎన్నికలలో పోటీ చేస్తాం

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు



ఫామ్ హౌస్ ల పేరిట డ్రామాలు ఆడుతుందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాటల ప్రభుత్వమేనని చేతల ప్రభుత్వం కాదు అని దుయ్యబట్టారు. వచ్చే ఖైరతాబాద్ ఉప ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థి ఫోటీ చేస్తారని పేర్కొన్నారు. లోపాయికారీ ఒప్పందాలలో భాగంగానే ఫామ్ హౌస్ లపై చర్యలు ఉండవని తెలిపారు.

## చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు

చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా చాకలిఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన గొప్ప యోధురాలని, ఆమె స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, డి.ఆర్.ఓ. ఏ. నిర్మల, జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం సిద్ధం

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని ఆయన తెలిపారు. ఈ మేరకు శనివారం ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. నవంబర్ రెండో భాగంలో కాళే శ్వరంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. 2027 వర్షాకాలానికి ముందే ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. పున రుద్ధరణ డిజైన్లను కూడా ప్రభుత్వం ఖరారు చేసిందని తెలిపారు. అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముం దు డిజైన్లు ఉ



ంచుతామని.. ఎన్డి ఎస్ఎ అభ్యంతరాలు, నిపు ణుల సూచనలను పరిగణన లోకి తీసుకుని ఈ పునరు ద్ధరణ పనులను చేపడుతున్నా మని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.కాగా,గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయిన సంగతి తెలిసిందే. దీంతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో నీళ్లను స్టోరేజీ చేస్తే.. బ్యారేజీలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఎన్డిఎస్ఎ తేల్చి చెప్పడంతో అప్పటి నుంచి నీళ్లను కిందకు వదులుతున్నారు.

## ప్రశాంతంగా గణేశ నిమజ్జనాలు పూర్తి..

హైదరాబాద్: భాగ్యనగరంలోని నాలుగు కమిషనరేట్‌లలో విజయవంతంగా గణేశ్ శోభాయాత్రలు ముగిశాయని హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ వ్యాఖ్యానించారు. ఈ వేడుకకు సహకరించిన అన్నిశాఖల అధికారులను అభినందించారు.హోం గార్డ్ నుంచి ఐపీఎస్ అధికారుల వరకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.శనివారం హైదరాబాద్‌లో మీడియాతో సీపీ సజ్జనార్ మాట్లాడారు.హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోఎక్కువగా శోభాయాత్రలు జరిగాయని వెల్లడించారు.

**ఖైరతాబాద్,బాలాపూర్ గణపతుల విగ్రహాలను సమయానికి నిమజ్జనం చేశాం..**

భాగ్యనగరంలోని గణేశ్ నిమజ్జనోత్సవాల బందోబస్తు కోసం తెలంగాణలోని బయట జిల్లాల నుంచి సిబ్బందిని రప్పించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జనాలను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ఖైరతాబాద్, బాలాపూర్ వినాయకుల విగ్రహాలను సమయానికి నిమజ్జనం చేశామని వెల్లడించారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈసారి గణనాథుల విగ్రహాలను దర్శించుకోవడానికి భక్తులు ఎక్కువగా వచ్చారని అన్నారు. 30 లక్షలకు పైగా భక్తులు ఖైరతాబాద్ గణేశ్‌ను దర్శించుకున్నారని చెప్పారు. బాలాపూర్ లంబోదరుడిని 15 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని వెల్లడించారు.

## రేషన్ ఈకేవైసీకి అక్టోబరు నెలాఖరు వరకు గడువు..

(మంచిర్యాల): రేషన్ లబ్ధిదారులు ఈ-కేవైసీ చేసుకునేందుకు ప్రభుత్వం అక్టోబరు నెలాఖరు వరకు గడువు పొడగించింది. జిల్లాలో 20శాతం మంది ఈకైవేసీ చేసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం మూడు నెలల బియ్యం కోటా పంపిణీ పూర్తి అయింది. రేషన్ దుకాణాల ను మూసివేశారు. ఈ నేపథ్యంలో ఇంటి నుంచే మొబైల్ ద్వారా ఈ కేవైసీ పూర్తి చేసుకునేలా ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. పూర్తయిందో లేదో తెలుసుకునేందుకు వెబ్‌సైట్‌ను తీసుకొచ్చింది. లబ్ధి దారుల కు కొంచెం అవగాహన ఉంటే ఈ ప్రక్రియ సులువుగా పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

**ఓటీపీ ద్వారా..**

ముందుగా మొబైల్‌లో పేస్టోర్ నుంచి మేరా ఈకేవైసీ యాప్ ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఆధా ర్‌పేస్ ఆర్డీ యాప్‌ను ఓపెన్ చేసి రాష్ట్రాన్ని ఎంపిక చేసు కొని ఆధార్ నంబర్, క్యాప్చను ఎంటర్ చేయాలి. వచ్చే ఓటీపీ ద్వారా వారి ప్చ్చ చేసుకొని ఆధార్‌యాప్‌లో లబ్ధిదారుల ఫోటో వెరిఫికేషన్ పూర్తిచేస్తే ఈ- కైవేసి ప్రక్రియ పూర్తియి



నట్లు సందేశం వస్తోంది.పౌరసరఫరాల శాఖ వారి లింక్ ను ఉపయోగించి రేషన్ కార్డు నెంబరు, క్యాప్చను నమోదు చేస్తే కుటుంబీకుల వివరాలు కన్పిస్తాయి. పేర్ల పక్కన యాక్టివ్ అని కన్పిస్తే ఈ కేవైసీ అయినట్టు, ఒక వేళ ఇన్‌యాక్టివ్‌గా ఉంటే ఈ- కేవైసీ కానట్టు భావించాల్సి ఉంటుంది. జిల్లాలో ఇంకా 20శాతం ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంది. గత మూడునెలల నుంచి ఎన్‌ఫోర్సుమెంటు శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు.అర్హులకు రేషన్ బియ్యం అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రక్రి యను చేపడు తున్నారు. ప్రతి ఒక్కరు కూడా ఈ కేవైసీ చేసుకోవాలని సూచిస్తున్నారు. రేషన్ చౌక దుకాణాల వద్దకు పోకుండా ఇంటి వద్దనే ఆన్‌లైన్ ద్వారా వెలుసుబాటు చేసుకునేందుకు మొబైల్ యాప్ ద్వారా అవకాశం ఇవ్వడంతో అంతా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# సంపాదకీయం

## ఆయా రామ్.. గయా రామ్ ఆగేదెలా?

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపుల వ్యవహారానికి దేశ అత్యున్నత న్యాయస్థానం కచ్చితమైన తీర్పు ఇచ్చింది. తెలంగాణ హైకోర్టు విధించిన అనర్హతవేటును సవాల్ చేస్తూ దాఖలైన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టేసింది. ఖైరతాబాద్ అసెంబ్లీస్థానం ఖాళీ అయిందని తేల్చిచెప్పింది. ఈ మొత్తం పరిణామాలపై ఫిరాయించిన ఎమ్మెల్యేలు ఎలాగూ సిగ్గుపడరు. కాంగ్రెస్‌లో ఉన్నామంటారు, లేమంటారు. ఫిరాయించినట్టు రుజువు ఎక్కడుందని ఎదురు ప్రశ్నిస్తారు. హైకోర్టు తిట్టినా, సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా సిగ్గుపడరు. ఇప్పుడు ఖైరతాబాద్‌లో రానున్న ఉపఎన్నికలో దానంకే కాంగ్రెస్ టికెట్ ఇచ్చినా ఆశ్చర్యం లేదు. ఎందుకంటే సిగ్గుపడరు కదా!దానం పార్టీ ఫిరాయింపుపై కథ అడ్డం తిరిగింది. ఈ పరిణామం అసెంబ్లీ స్పీకర్ల కాలయాపన, అధికార పార్టీల వ్యూహాత్మక నాన్చివేత ధోరణులకు చెక్ పెట్టినట్టు అయింది. దేశంలో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఎదుర్కొంటున్న లోతైన రాజ్యాంగపరమైన పరిమితులను మరోసారి బహిర్గతం చేసింది. సుప్రీంకోర్టులో 'ఘర్ వాపసీ'పై జస్టిస్ బాగ్చి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అత్యంత ఖరీదైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని రంగంలోకి దించినప్పటికీ దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో దిక్కు లేకుండా పోయింది. జస్టిస్ జాయ్ మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం ముందు జరిగిన వాదనలు బీఆర్ఎస్ వర్గాల్లో సంతోషం,కాంగ్రెస్ వర్గాల్లో విషాదం నింపాయి. సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా జరిగిన కొన్ని పరిణామాలను గమనిద్దాం. మొదట స్పీకర్ ఇచ్చిన ఆర్డర్‌పై జస్టిస్ బాగ్చి వ్యంగ్యంగా స్పందిస్తూ, స్పీకర్ నిర్ణయం తీసుకున్న శైలి ఆకట్టుకున్నదని వ్యాఖ్యానించారు. దీనిపై రోహత్గీ స్పందిస్తూ, పార్టీ క్రమశిక్షణ లేదా ఫిరాయింపుల్లో 'క్షమాపణ' అనే వెసులుబాటు ఉంటుందని, తన క్లయింట్ ఇప్పటికీ బీఆర్ఎస్ సమావేశాలకు హాజరవుతున్నారని, పార్టీ కూడా ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని,ఇది ఒకరకంగా 'ఘర్ వాపసీ'వంటిదని వాదించారు. ఆ సందర్భంలోజోక్యం చేసుకున్న జస్టిస్ బాగ్చి ఘాటుగా చురకలంటించారు. ఘర్ వాపసీయా? మీ వాదన చూస్తుంటే ఆయా రామ్, గయా రామ్, ఫిర్ ఆయా రామ్ అన్నట్టుంది. ఒక పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని వదులుకున్న మరుక్షణమే సభ సభ్యత్వాన్ని కోల్పోతారని తేల్చిచెప్పారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం: పేరా 2(1)(బి): సభ లోపల విప్‌ను ఉల్లంఘించినప్పుడు మాత్రమే 15 రోజుల్లోగా రాజకీయ పార్టీ క్షమించే వెసులుబాటు ఉంటుంది. పేరా 2(1)(ఎ): సభ వెలుపల స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నప్పుడు అటువంటి క్షమాపణలకు తావు లేదు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే కాంగ్రెస్ 'బీ-ఫారం' తీసుకుని, ఫారం-26 సమర్పించి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన తర్వాత, ఇంకా గత పార్టీలోనే ఉన్నానని చెప్పడం పచ్చి మోసం తప్ప మరొకటి కాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. సాధారణంగా స్పెషల్ లీవ్ పిటిషన్ విచారణకు స్వీకరిస్తారో, తిరస్కరిస్తారో ఒకే ఒక్క పాయింట్ మీద నిలబడుతుంది. కానీ ధర్మాసనం ఓ నాలుగు అక్షింతలు వేసి మరీ కొట్టివేసింది. హైకోర్టు అనర్హత వేటు వేయగానే దానం నాగేందర్ తొలుత తాను సుప్రీంకోర్టుకు వెళ్లబోనని, ప్రజాతీర్పునకే సిద్ధమని ప్రకటించారు. అదే మంచి స్పందన అని రాజకీయ పరిశీలకులు అనుకుంటారు. కానీ ఆ అవకాశం లేదు. మరుసటి రోజే 'ప్రభూ దృశ్యం మారిపోయింది' అని చెప్పుకోవలసి వచ్చింది. కాంగ్రెస్‌లోని కొందరు వ్యూహకర్తల అత్యుత్సాహం వల్ల ఆయన పేరుతో సుప్రీంకోర్టులో అత్యవసరంగా పిటిషన్ దాఖలైంది. స్టే తెచ్చుకుని ఉపఎన్నికను ఎలాగైనా వాయిదా వేయించవచ్చన్న ఆశతో వేసిన ఈ తప్పటడుగు దానంను దెబ్బతీసింది. ఒకవైపు అధికార కాంగ్రెస్‌లో ఉంటూ, కోర్టు బోనులో నిలబడి 'నేను ఇంకా బీఆర్ఎస్ వాడినే, ఇది ఘర్ వాపసీ' అని వాదించాల్సిన స్థితి దానంకు ఎదురైంది. చివరకు దేశ ఢిల్లీ స్థాయిలో పెద్దల ముందు చీవాట్లు తిని, పరువు బజారున పడేసుకున్న ఫలితం మిగిలింది. మొత్తానికి హైకోర్టు 2024 ఏప్రిల్ 23 నుంచే దానం నాగేందర్‌పై అనర్హత వర్తిస్తుందని ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయిందని తేల్చిచెప్పింది. అయితే ఇక్కడే ఒక కీలకమైన రాజ్యాంగ సంక్లిష్టత నెలకొన్నది. అనర్హత వేటు పడిన దానం నాగేందర్,అదే ఖాళీకి జరిగే ఉపఎన్నికలో మళ్లీ పోటీ చేయవచ్చా? 2020లోకర్ణాటక రెబెల్ ఎమ్మెల్యేల కేసులో (శ్రీమంత్ బాలాసాహెబ్ పాటిల్ వర్సెస్ కర్ణాటక స్పీకర్) సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం, అనర్హతకు గురైన ఎమ్మెల్యే తక్షణమే మళ్లీ పోటీ చేయవచ్చు. ఆర్టికల్ 191(1): సాధారణ అనర్హతలు (లాభదాయక పదవులు,నేరారోపణలు):సభ్యుడిగా ఎన్నిక కావడానికి, కొనసాగడానికి అనర్హత. ఆర్టికల్ 191(2)పదోషెడ్యూల్ అనర్హత (ఫిరాయింపులు): సభ్యుడిగా కొనసాగడానికి మాత్రమే అనర్హత. తదుపరి ఎన్నికల్లో పోటీ చేయడాన్ని ఇది నిషేధించదు. జస్టిస్ ఎన్.వి.రమణ నాయకత్వంలోని ధర్మాసనం పేర్కొన్న ప్రధాన అంశాలు ఉన్నాయి. నిజానికి ఈ తీర్పు, ఫిరాయించిన ఎమ్మెల్యేలకు అనుకూలంగా, రాజ్యాంగ నైతికతకు వ్యతిరేకంగా ఉన్నది. ఆర్టికల్ 164(1బీ), 361బీ నిబంధన: 91వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన ఆర్టికల్ 164(1బి) ప్రకారం, ఫిరాయింపుల వల్ల అనర్హుడైన సభ్యుడు ఆ అసెంబ్లీ కాలపరిమితి ముగిసేవరకూ లేదా 'ఆ స్థానానికి జరిగే ఎన్నికల్లో మళ్లీ గెలిచే వరకు 'మంత్రి పదవి చేపట్టడానికి వీల్లేదు.

# వనస్థలిపురంలో సత్యాబామ డిజైనర్ వేవ్స్ మెగా ఎక్స్‌పో ప్రారంభం

### రెండు రోజుల పాటు ప్రత్యేక వస్త్ర ప్రదర్శన.. అందుబాటు ధరల్లో సరికొత్త డిజైన్లు

వనస్థలిపురం, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 26:వనస్థలిపురంలోని ప్రశాంత్ నగర్‌లో ఉన్న కనకదుర్గ దేవాలయ కల్యాణ మండపంలో



సత్యాబామ డిజైనర్ వేవ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఎక్స్‌పో శనివారం ఘనంగా ప్రారంభమైంది. దసరా పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక వస్త్ర ప్రదర్శనలో సరికొత్త డిజైన్లు, ఆకర్షణీయమైన వెరైటీలను అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు సీతారెడ్డి, నారాయణి రెడ్డి, దివ్యా రెడ్డి మాట్లాడుతూ సత్యాబామ డిజైనర్ వేవ్స్ మెగా ఎక్స్‌పో కేవలం సెప్టెంబర్ 26, 27 తేదీల్లో రెండు రోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సరికొత్త డిజైన్లను, నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా తమ సంస్థను విజయవంతంగా నిర్వహిస్తూ వినియోగదారులకు నూతన డిజైన్లను పరిచయం చేస్తున్నామని తెలిపారు. దసరా పండుగను పురస్కరించుకుని ప్రత్యేకమైన వెరైటీలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. పండుగ వేళ తమకు నచ్చిన డిజైన్లను అందుబాటు ధరల్లో కొనుగోలు




చేసేందుకు ఈ మెగా ఎక్స్‌పో మంచి అవకాశమని పేర్కొన్నారు. ఈ



రెండు రోజుల ప్రత్యేక ప్రదర్శనను వనస్థలిపురం, పరిసర ప్రాంతాల ప్రజలు సందర్శించి, తమకు నచ్చిన వస్త్రాలను కొనుగోలు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**- అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా అనేక కార్యక్రమాలు**
**- విద్యార్థుల అభివృద్ధికి నిరంతర కృషి**
**- జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ భాను ధర్మానాయక్**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):విద్యార్థుల భవిష్యత్తు కోసమే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వ్యవస్థ విజయవంతంగా ముందుకు



వెళ్తుందనిఅంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ భాను ధర్మానాయక్ స్పష్టం చేశారు. కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ అటానమస్ కళాశాలలో శనివారం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కోఆర్డినేటర్లు, కౌన్సిలర్స్ తో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి ఉపాధి అవకాశాలు ఆర్థిక స్వావలంబన కల్పించే లక్ష్యంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పలు నూతన కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. యూనివర్సిటీ ద్వారా రాశి సహకారంతో స్టైపెండ్‌తో కూడిన అప్రెంటిస్‌షిప్ వి హబ్ ద్వారా మహిళా సాధికారత టిసిఎస్ ఐకాన్ ద్వారా ఉద్యోగ నైపుణ్య శిక్షణ నిపుణ ఫెలోషిప్ సమతా సహాయ పథకంవంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా గ్రామీణ గిరిజన యువతకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందిస్తూ వారిని ఉపాధి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ఎంతో ముఖ్యమని విద్యార్థులు యూనివర్సిటీ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. విద్యతో పాటు నైపుణ్యం ఉపాధితో ఆర్థిక స్వావలంబన అనే లక్ష్యంతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నిరంతరం కృషి చేస్తోందని ప్రొఫెసర్ బానోత్ ధర్మానాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రెడ్యా నాయక్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ, ఖమ్మం రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ గుగులోత్ వీరన్న, డాక్టర్ పూర్ణచంద్రరావు, పాల్వంచ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ పారెల్లి శ్రీనివాస్, కొత్తగూడెం కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, దివ్య, రాందాసు ఇతర కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

# కారుకొండ బౌద్ధారామాలయాలను సందర్శించిన విద్యార్థులు



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్),కొత్తగూడెం చరిత్ర శాఖఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన హెరిటేజ్ వాక్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కారుకొండ ప్రాచీన బౌద్ధారామాలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ పి.పద్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం కేవలం పర్యాటక రంగ ప్రాముఖ్యతను గుర్తు చేయడమే కాకుండా స్థానిక చారిత్రక సాంస్కృతిక సహజ వారసత్వ సంపదను సంరక్షించాల్సిన బాధ్యతను కూడా గుర్తు చేస్తుందని తెలిపారు. హెరిటేజ్ వాక్‌లో భాగంగా విద్యార్థులు కారుకొండ కొండపై ఉన్న ప్రాచీన బౌద్ధ గుహాలయాలు స్థూపాలు బౌద్ధ అవశేషాలను పరిశీలించారు. కొండపై రాతిని చెక్కి నిర్మించిన ఈ బౌద్ధ గృహాలు ప్రాచీన శిల్పకళా వైభవానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని అధ్యాపకులు వివరించారు. తెలంగాణలోని ప్రముఖ ప్రాచీన బౌద్ధగృహాలలో ఈ కారుకొండ బౌద్ధ గృహాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు డాక్టర్ జి.మధు, డాక్టర్ వి.కామేశ్వరరావు, డి.ధర్మారావు, ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రవాహమే జీవితం

మనిషి జీవితం ఒక నీటి ప్రవాహం,
ఎక్కడో ఒక చిన్న చినుకుగా మొదలవుతుంది,
కొండల ఒడిలో జారే సెలయేరై సాగుతుంది,



రాళ్లను తాకినా తన దారిని వెతుక్కుంటుంది,
లోయలు ఎదురైనా వెనక్కి తిరిగి చూడదు.
వాగులు వంకలు దారిలో కలిసినా,
వాటినన్నింటినీ తనలో కలుపుకుంటుంది,
అలాగే జీవితంలో బంధాలు చేరుతుంటాయి.
కొన్ని మలుపులు ఆనందాన్ని అందిస్తాయి,
కొన్ని మలుపులు కన్నీళ్లను మిగుల్చుతాయి,
అయినా ప్రవాహం ఆగిపోదు,
జీవితం కూడా నిలిచిపోదు.
దారిలో దాహంతో ఉన్నవారికి,
తన నీటిని పంచే నదిలా,
కష్టాల్లో ఉన్నవారికి చేయూతనివ్వాలి.
మన ఉనికి మనకోసం మాత్రమే కాదు,
ఎవరి జీవితానికైనా చల్లదనం కావాలి.
ఎండలు ఎదురైనా నీరు ఆవిరైపోయినా,
మేఘమై మళ్లీ వర్షంగా తిరిగి రావాలి.
ఓటములు ఎదురైతే రాళ్లలా భావించాలి,
వాటిని ఢీకొని దారిని సృష్టించాలి.
కాలం ఎన్నో ఒడ్డులను మార్చినా,
మన ప్రయాణం మాత్రం కొనసాగాలి.
గెలుపు కోసం కాదు, గమ్యం కోసం కాదు,
ప్రయాణంలో ఎవరికైనా వెలుగై నిలవాలి.
చివరికి ప్రతి ప్రవాహానికీ ఒక సముద్రం,
ప్రతి జీవితానికీ ఒక అంతిమ గమ్యం,
అందుకే ఉన్నంతకాలం స్వచ్ఛంగా ప్రవహించాలి,
మంచిని పంచుతూ ముందుకు సాగాలి,
సముద్రంలో కలిసే వరకూ? జీవితం లాగా ప్రవహించాలి.

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు. చరవాణి : 9866179385

# చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

**హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

హయత్‌నగర్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 26:తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి చింతకుంటలోని ఐలమ్మ విగ్రహానికి



పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ త్యాగం, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆమె ధైర్యసాహసాలు, పోరాట పటిమ నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్‌నగర్, హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, మధుసూధన్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

# చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

**– ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం**
**– భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడారని తెలంగాణ రైతాంగ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి మహిళల్లో స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు వారి ఆశయాలకు అనుగుణంగా సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లి ఆమె ఆశయాల సాధనకు కృషి చేయాలని అన్నారు. ఐలమ్మ పోరాటాలు ఆశయాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి, జిల్లా అధికారులు, బీసీ సంఘాల నాయకులు నేరెళ్ల రమేష్, అజిత్ కుమార్, కే.వంశీ, పి.కొండల్, పి.శంకర్, మల్లయ్య, ఎన్.మోహన్ రావు, కొదుమూరి సత్యనారాయణ, జి.సత్యనారాయణ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతిలో ఘనంగా చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు

**ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం**
**: డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి**



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 26:తెలంగాణ వీరనారి, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక చాకలి (చిట్యాల) ఐలమ్మ 131వ జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకల్లో రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూస్వామ్య అణచివేతకు, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అణచివేతకు ఎదురొడ్డి నిలిచి, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన ఐలమ్మ జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ముఖ్యంగా మహిళలు ఆమె పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. చాకలి ఐలమ్మ ఆశయాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు నిరంతరం మార్గదర్శకంగా నిలుస్తాయని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

# స్ఫూర్తి సంకేత్ తెలుగు?హిందీ పక్ష పత్రిక ప్రారంభం

**తెలుగు – హిందీ రెండు భాషలకు సముచిత ప్రాధాన్యం**
**: డా. గుండాల విజయ కుమార్**

హైదరాబాద్, సెప్టెంబర్ 26(జ్యోతి ప్రభనీజనం): సమాజానికి సత్యమైన సమాచారాన్ని అందిస్తూ, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సాహిత్యం, సంస్కృతి, విద్య, ఆధ్యాత్మికత, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో స్ఫూర్తి సంకేత్ తెలుగు?హిందీ పక్ష పత్రిక సెప్టెంబర్ 25, 2026న ఘనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని వనస్థలి పురం శ్రీ సువర్చల ఆంజనేయ స్వామి దేవాలయం లో జరిగిన ఈ ప్రారంభ కార్యక్రమంలో పత్రిక సంస్థాపకులు, సంపాదకులు డా. గుండాల విజయ కుమార్,మాచేటి నరసింహ రాజు,విజయ మహావా ది,యుగళ మహావాది,కె. స్వామి,జె. రాజు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా సంస్థాపకులు డా. గుండాల విజయ కుమార్ మాట్లాడుతూ.పత్రిక తొలి సంచిక ను భక్తి శ్రద్ధలతో శ్రీ సువర్చల ఆంజనేయ స్వామి వారికి సమర్పించి, స్వామివారి ఆశీస్సులతో పత్రిక ప్రయాణాన్ని ప్రారంభించామని, తెలుగు ప్రాంతాల్లో తెలుగు– హిందీ రెండు భాషలకు సముచిత ప్రాధాన్యతనిస్తూ వెలువడుతున్న ద్విభాషా పక్ష పత్రికగా స్ఫూర్తి సంకేత్ ను తీర్చిదిద్దుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వెలువడే ఈ పత్రికలో జాతీయ, రాష్ట్ర, స్థానిక వార్తలతో పాటు విద్య, సాహిత్యం, కళలు, సంస్కృతి, ఆధ్యాత్మికం, క్రీడలు, ఆరోగ్యం, మహిళా?యువజన అంశాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని స్థానిక అంశాలు, గ్రామీణ ప్రాంతాల విశేషాలు, ప్రతిభావంతుల విజయాలు, సేవా కార్యక్రమాలు, సమాజానికి ఆదర్శంగా నిలిచే వ్యక్తుల గురించి ప్రత్యేక కథనాలు



ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. సత్యం– సమాజం– స్ఫూర్తి అనే భావనతో ప్రజలకు ఉపయోగపడే బాధ్యతాయుతమైన పత్రికగా స్ఫూర్తి సంకేత్ ను ముందుకు తీసుకెళ్లడమే తమ సంకల్పమని డా. గుండాల విజయ కుమార్ తెలిపారు. పత్రిక ప్రారంభానికి సహకరించిన పాత్రికేయులు, రచయితలు, కవులు, సాహితీవేత్తలు, సామాజిక సేవకులు, శ్రేయోభిలాషులు, ప్రకటనదారులు మరియు పాఠకులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం

రంగారెడ్డి :26 సెప్టెంబర్ :రూ.1,000 కోట్లతో 5,118 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం3,269 భవనాల పనులు 70 శాతం పూర్తిఈ ఏడాదిలో అన్ని భవనాల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యం8,000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు ? రూ.800 కోట్లుహ్యామ్ రహదారుల పనులు గడువులోగా పూర్తి చేయాలిముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి సొంత భవనం ఉండేలా స్యాచురేషన్ మోడ్‌లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాన్ని చేపడుతున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని మంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5,118 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేవని, ఆయా గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ. 1,000 కోట్ల నిధులను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 3,269 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు సుమారు 70 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా ఈ ఏడాదిలో పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 8,000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలుగ్రామ పంచాయతీ భవనాలతో పాటు రాష్ట్రంలోని 8,000 గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలను నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 800 కోట్ల నిధులను మంజూరు చేసిందని, ఇప్పటికే నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు అందుబాటులోకి రావడం ద్వారా వారి కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. హ్యామ్ రహదా రుల పనులు గడువులోగా పూర్తి చేయాలితెలంగాణలో గ్రామీణ రహదారులను హ్యామ్ విధానంలో నిర్మిస్తున్నామని, దేశంలోనే తొలిసారిగా ఈ విధానాన్ని గ్రామీణ రహదారుల నిర్మాణానికి వినియోగిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. హ్యామ్ ప్రాజెక్టు కింద ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 3,861 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మిస్తున్నామని, ఇందుకోసం సుమారు రూ. 3,382 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో చేపడుతున్న హ్యామ్ రహదారుల్లో సుమారు 50శాతం ఈ నాలుగు జిల్లాల్లోనే ఉన్నం దున అధికారులు, కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచి ంచారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు నిర్మాణ పనులకు అనువైన కాలాన్ని పూర్తిగా వినియోగించుకుని పనులను వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఆవాసం నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలన్నది ముఖ్యమంత్రి ఆలోచన అని, ఆ లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ రహదారులను బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలుఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ నాలుగు జిల్లాల్లోని 19 రిజర్వాయర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని, సింగూరు మినహా మిగిలిన రిజర్వాయర్లలో తగినంత నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. సింగూరు రిజర్వాయర్‌లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేనందున ప్రత్యేక అధికారిని నియమించి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, నిజాంసాగర్ నుంచి సింగూరుకు నీటిని తరలించే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి మండలానికి ముగ్గురు సభ్యులతో డ్రింకింగ్ వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేసి, ప్రత్యామ్నాయ నీటి వనరులను ముందుగానే గుర్తించాలని ఆదేశించారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాలు, చెంచు పెంటల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలివర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ పనులు తగ్గే అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు కల్పించాలని మంత్రి సీతక్క సూచించారు. ఉపాధి హామీ పథకం కింద అందుబాటులో ఉన్న రూ. 6 వేల కోట్ల బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకుని గ్రామాల్లో మౌలిక వసతులు, నీటి సంరక్షణ పనులు చేపట్టాలని ఆదేశించారు. జలసిరి కార్యక్రమం కింద చేపట్టిన నీటి సంరక్షణ పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, ప్రతి గ్రామం సమృద్ధిగా, సమగ్రంగా అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత, గడువు తప్పనిసరిఅభివృద్ధి పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ భవనాలు, మహిళా సంఘాల భవనాలు, రహదారులు, తాగునీరు, ఉపాధి హామీ, నీటి సంరక్షణ వంటి అన్ని అంశాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, అడిషనల్ కమిషనర్ రవీందర్, అదనపు కలెక్టర్లు, సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీఓలు, ఇంజినీరింగ్ అధికారులు, ఎస్ఈలు, ఈఈలు, ప్రాజెక్ట్ మానిటరింగ్ అధికారులు, జాయింట్ కమిషనర్లు, ఇతర సీనియర్ అధికారులు, హ్యామ్ రహదారుల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలములో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి..

**గ్రామ పెద్దల తీర్మానంతో తాసిల్దార్ దయానందం కు వినతి పత్రం.. చిలుకల వెంకన్న..**



తుంగతుర్తి సెప్టెంబర్ 26. తుంగతుర్తి మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో ప్రభుత్వ భూమి రెండు ఎకరాలకు పైగా ఉండడంతో మా గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ పెద్దలు వార్డు సభ్యుల తీర్మానంతో మా గ్రామంలో 30 పడగల హాస్పిటల్ ను నూతనంగా నిర్మాణం చేయాలని గ్రామ పెద్దల తీర్మానం సర్పంచ్ చిలుకల మంజుల వెంకన్న మాట్లాడుతూ మా గ్రామంలోని గ్రామపంచాయతీ పెద్దలుఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యుల సంతకాలతో ఈరోజు తుంగతుర్తి తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ దయానందం కు వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు మా గ్రామంలో మెయిన్ రోడ్డుకు దగ్గరలో రెండు ఎకరాల భూమి ఉ న్నది అట్ సర్వేనెంబర్ 578లో ఆ భూమి ప్రభుత్వానిదే కావున మా గ్రామం చుట్టూ 10 గ్రామాలు ఆవాస ప్రాంతాలు ఉన్నవి వారందరికీ మా గ్రామం మధ్యలో ఉంటే వారికి సౌకర్యాలు దగ్గరగా ఉంటాయని వేమము మా గ్రామ పెద్దలు నిర్ణయంతో గత రెండు రోజుల క్రితం జిల్లా అధికారులు మా మండలంలోని మా గ్రామం పక్కన ఉన్న రావులపల్లి ఎక్స్ రోడ్డు తండాలో భూమిని పరిశీలించడంతో మేము తక్షణమే మా గ్రామంలో గ్రామ పంచాయతీలో తీర్మానం చేసుకొని మా భూమి రెండు ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నది కావున అందులో ముప్పై పడకల హాస్పిటల్ పెట్టడానికి మంచి అవకాశం ఉన్నది కావున మా గ్రామానికి ఈ హాస్పిటల్ ను మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వార్డు సభ్యులు పాల్గొన్నారు..

# కోటి విద్యా స్కూల్‌లో ఘనంగా ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం



జల్‌పల్లి, జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 26: జల్‌పల్లి శ్రీరామ కాలనీలోని కోటి విద్యా స్కూల్‌లో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు నాటికల రూపంలో చెత్త నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం వల్ల కలిగే ప్రయోజనాలను, చెత్తను నిర్లక్ష్యంగా భూమిలో పడేయడం వల్ల కలిగే అనర్థాలను తమ ప్రదర్శనల ద్వారా చక్కగా వివరించారు.పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులు తమ నాటికల ద్వారా తెలియజేశారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా స్వచ్ఛమైన గాలిని పొందవచ్చని, తద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని వివరించారు. పర్యావరణ పరిశుభ్రతపై విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ లేక రైతుల ఇబ్బందులు

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 26(జ్యోతి ప్రభంజనం):వ్యవసాయ రైతాంగానికి కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చిన్నకాపర్తి, ఆరెగూడెం, పెద్దకాపర్తి గ్రామాల్లో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు



మాట్లాడుతూ కరువు పరిస్థితుల్లో పంటలకు సాగునీరు అందించేందుకు విద్యుత్‌పై ఆధారపడుతున్న రైతులకు తరచూ కోతలు విధించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల లింగస్వామి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఐతరాజు నర్సింహ్మ, నాయకులు లడే రాములు, అర్రూరి శ్రీను, కోనేటి రాములు, వీరమళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐలమ్మ జయంతి

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 26(జ్యోతి ప్రభంజనం):తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట



యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని చిట్యాల మండలంలోని చిట్యాల, వెలిమినేడు, వెంబావి, సుంకెనపల్లి, చిన్నకాపర్తి గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. రజక సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా గ్రామాల్లో ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భూస్వామ్య, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మీసైదులు, సర్పంచ్‌లు బొంతల చంద్రారెడ్డి, గుణగంటి అలివేలు వెంకన్న, ఆవుల సునీత యాదయ్య, ఆవుల సుందర్, రజక సంఘం అధ్యక్షుడు గోలి కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి గుండెపురి చంద్రయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, రజక సంఘం నాయకులు గోలి నర్సింహ్మ, గోలి అంజనేయులు, గోలి నరేష్, గోలి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

### ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 26:వీరనారి చాకలి ఐలమ్మ



జయంతి సందర్భంగా ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి చింతలకుంటలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

# గణపతి లడ్డూ వేలంలో రూ.36,116.

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 26(జ్యోతి ప్రభంజనం):చిట్యాల



మండలంలోని తాళ్లవెల్లంల గ్రామంలో యంగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో శనివారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఆ యూత్ అధ్యక్షుడు ఏర్పుల అనిల్ అధ్యక్షతన జరిగిన ఈ వేలం పాటలో తెలంగాణ మలిదశ ఉద్యమ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు లింగస్వామి రూ.36,116లకు లడ్డూను దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జోగు సురేష్ , యూత్ సభ్యులు నక్క సైదులు, జోగి శివ, నక్క యాదగిరి, వెంకటేష్, కిరణ్, పవన్, సైదులు, అభి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు

ఎల్బీనగర్, సెప్టెంబర్ 26, జ్యోతి ప్రభంజనం ప్రతినిధి: ఎల్బీనగర్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ ఫేజ్-1లో ద్విముఖ వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక



పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించారు.ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన స్వామివారి లడ్డూ ప్రసాదం వేలంపాటలో వడ్డే రాఘవేందర్?మమత దంపతులు ఉత్సాహంగా పాల్గొని రూ.1,10,000లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దంపతులను అభినందించారు. భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

# గణనాథునికి ప్రత్యేక పూజలు.

### శ్రీ రేణుక ఎల్లమ్మ కాలనీ ఆధ్వర్యంలో ఘనంగా అన్నప్రసాద కార్యక్రమం

యాచారం, సెప్టెంబర్ 26 (మెట్రో ఉదయం):రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ కాలనీలో ప్రతిష్ఠించిన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీ వాసుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద





కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గణనాథుని దర్శనం కోసం భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.అన్నప్రసాద కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సేవా భావాన్ని చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికులను ఆకట్టుకుంది. ఇలాంటి కార్యక్రమాలు గ్రామ ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చి ఐక్యతను పెంపొందిస్తాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# బెత్తం వాడి జైలుపాలైన ఒక ఉపాధ్యాయుడి మనోవేదన

విద్యార్థుల మధ్య జరిగిన గొడవను ఆపేందుకు బెత్తం ఉపయోగించినందుకు రెండు రోజులు పోలీస్ స్టేషన్ వరండాలో గడపాల్సి రావడం, ఆ తర్వాత ?15,000 పరిహారం కూడా చెల్లించాల్సి వచ్చిన వాయనాడ్ విజయ హయ్యర్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయుడి ఆవేదనతో కూడిన రాత.రెండు రోజుల అనుభవం..ఇన్నేళ్లు ఉపాధ్యాయుడిగా పనిచేసినా రాని అవగాహన, ఈ రెండు రోజుల్లో నాకు వచ్చింది. అందుకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు, రాజకీయ నాయకులకు నా కృతజ్ఞతలు.నేటి కాలంలో ఉపాధ్యాయుడికి అధికారమూ లేదు, హక్కులూ లేవు; కేవలం బాధ్యత మాత్రమే ఉంది అనే విషయం నాకు అర్థమైంది. ఇకపై విద్యార్థులు ఒకరినొకరు కొట్టుకున్నా, తప్పుడు



దారిలో నడిచినా,చదివినా చదవకపోయినా, పరీక్షల్లో కాపీ కొట్టినా,పాఠశాలఆస్తిని ధ్వంసం చేసినా,మత్తుపదార్థాలు తీసుకున్నా..ఏం చేసినా కళ్ళు,చెవులు మూసుకుని కేవలం జీతం తీసుకుని ఇంటికి వెళ్తే చాలు అనే పాఠాన్ని ఈ సమాజమే నాకు నేర్పింది.నేను చేసిన చిన్న శిక్షను ప్రతి ఒక్కరూగంటకోసారి భూతద్దంలో పెట్టి చూపిస్తూ,అదో భయంకరమైన నేరంఅన్నట్లు చిత్రీకరించ డాన్ని కూడా చూశాను.ఇకముందు ఎలాంటి బాధ్యతల ఒత్తిడి లేకుండా,పాఠం చెప్పడం ముగించుకుని ఇంటికి వెళ్లిపోయే ఉపాధ్యాయుడిగా ఉండటమే మంచిదని భావిస్తున్నాను.అందుకే, ఇకపై నేను ఎవరినీ సరిదిద్దడానికి ప్రయత్నించబోనని ఈ సమాజానికి, నా ప్రియమైన విద్యార్థులకు తెలియజేస్తున్నాను. దీనివల్ల నాకు ఒక రకమైన మనశ్శాంతి దొరికింది. శుభం.తదుపరి భాగం: పాఠశాల పిల్లలను తమ సొంత బిడ్డల్లా భావించి,వారిని మంచి మార్గంలో నడిపించాలని చూసిన ఒక నిజాయితీపరుడైన ప్రధానోపాధ్యాయుడిని బలిపశువును చేసిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు మేము (ఉపాధ్యాయులం) క్షమాపణలు చెబుతున్నాము. మిమ్మల్ని మా సొంత పిల్లల్లా చూడటం మేము చేసిన తప్పు,మిమ్మల్ని సరిదిద్దాలని చూడటం ఇంకా పెద్ద తప్పు.క్లాస్‌రూమ్‌లలో అబ్బాయిలు-అమ్మాయిలు కలిసి మద్యం సేవించడం, చెడు సావాసాల వైపు వెళ్లడం సరైనది కాదని చెప్పి, వారిని మార్చడానికి ప్రయత్నించడం పిల్లల హక్కుల ఉల్లంఘన, మానవ హక్కుల ఉల్లంఘన అవుతుందని మేము గ్రహించలేకపోయాము.అందుకు మమ్మల్ని క్షమించండి పిల్లలూ... క్షమించండి.ఒక్క విషయం గుర్తుపెట్టుకోండి;మీ ఏడు తరాల మంచి కోసం ఆ దేవుడిని ప్రార్థించండి, ఆ దేవుడే మిమ్మల్ని క్షమించాలి.చివరి సందేశం:ఈ సందేశాన్ని మంచి తల్లిదండ్రులకు చేరేలా చూడండి. కనీసం వారిలోనైనా ధర్మబుద్ధి మిగలాలి. వివేకం లేని ఇలాంటి చట్టాలనే మొదట మార్చాల్సి ఉంది.ఈ పోస్ట్‌ను ఏదో మామూలు సందేశంలా భావించి నిర్లక్ష్యం చేయకండి. కాస్త సమయం తీసుకుని చదవండి, ఆలోచించండి. ఇది ఒక ఉపాధ్యాయుడి మనసులోని తీవ్రమైన వేదన నుండి వచ్చిన ఆవేదన పూరిత మాటలు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**